

కథా కౌముది

# రబ్బరుబాండు

కొండపల్లి వివేకానంద

దాటుకుంటూ పోయే వీధి దీపాల వెలుతురులో చూసిన మొహమది. ఒకరోజు స్పష్టంగా గుర్తొస్తే ఇంకోరోజు అస్సలు కనబడదు. పదేళ్ల తర్వాత ఇవ్వాళ మొత్తం కనిపిస్తోంది. అదేదో నిన్నే జరిగినట్టు....

అవి కమలహాసన్ దశావతారం సినిమా రోజులు. నా వయసు 22. అప్పటికి అచంచలుణ్ణి. నాతోపాటు బస్సెక్కిన నా మిత్రుడికి పాతిక. అప్పటికే వాడు చాలా కాలం నుంచి చలిస్తున్నానని చాలా సార్లు చెప్పాడు. చదువుకునే రోజుల్లో మార్కులు నాకన్నా వాడికి తక్కువొచ్చేవి...కానీ నా కన్నా వాడే ఎక్కువ ఆకులు చదివాననేవాడు.

అసలిప్పుడు ఈ రాతంతా వీడి గురించి చెప్పడానిక్కాదు. అదిగో ఇంత రద్దీ బస్సు మధ్యలో నాకు ఐమూలగా ఓ ఇనపకమ్మికి తన మృదుత్వాన్నంతా అరగదీసుకుంటూ నిలుచున్న ఆ అలివేణి గురించి. స్త్రీలకు కేటాయించిన సీట్లలో స్త్రీలు నిండిపోవడంతో ఈ కోమలాంగి నిలబడాల్సి వచ్చింది. పోనీలే నా కంటపడింది. దివ్యసౌందర్యదర్శనం.

చాలామంది పురుషపుంగవులు త్యాగధనులై లేవబోయారు. కొందరితో వద్దని...కొందరితో అక్కర్లేదంది. నా ఒక్కడికి మాత్రం ఎందుకో లేవబుద్ధవ్వలేదు. నిజానికి పిలిచి ఒళ్లో కూర్చోబెట్టుకోవాలనిపించింది.

ఏం చేయను! చలించా. మొదటిసారి.

తనను చూస్తుంటే ఎంత హాయిగా ఉందో ప్రాణానికి.

ముంగురులంటే అవే అన్నమాట...భలే ఉన్నాయి బద్ధకంగా నొసటిపై పొర్లుతూ! దురదృష్టపు బొట్టుబిళ్ల ఎక్కడ జారిపోయిందో పిచ్చిది. కళ్లను చూద్దామంటే ధ్యానంలో ఉన్నట్టే మూసి ఉంచింది.

♪♫♪♫♬ మూసిన ముత్యాలకేలే మొరగులు ♪♫♪♫♬

డ్రైవరు బ్రేకేస్తే బావుండు...కళ్లు తెరుస్తుంది.

♪♫♪♫♬ ఆశల చిత్తానికేలే అలవోకలు ♪♫♪♫♬

అన్నమయ్య పాటలెందుకు పెట్టారో ఇప్పుడు.

ఎంత అందమైన ముక్కు. Sharp features. సంపెంగలతో ఎందుకు పోలుస్తారో...నాకైతే octopus లా ఉంటుందా పువ్వు. చిక్కటి పెదవులు...మొత్తం తేనే నిండినట్టున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ విగ్రహం నిండా తెలుగు కవులకు కావలిసినంత కాంతి విశేషము. ఆహా..!

కత్తిలా ఉంది కదా? [పక్కనుంచి నా చపలచిత్త మిత్రద్రోహి]

ఇంతసేపటి నా సౌందర్యారాధననంతా ఆ కత్తితో ఒక్క పోటు పొడిచాడు.

నేను: నువ్వూ చూస్తున్నావా?

వాడు: అందరికీ తనొక్కతే కనపడుతోంది.

నేను: కాసేపట్లో లైట్లు ఆర్పేస్తారు. అందరితో పాటు నువ్వు కూడా పడుకో...

వాడు: నువ్వేం చేస్తావ్?

నేను: తనని పిలిచి ఒళ్లో కూర్చోబెట్టుకుంటా... నీకెందుకురా...పడుకో...

వాడు: మంచిది. పడుకుంటున్నా. మనూరొచ్చాక లేపు. లేకపోతే నిన్నెవరైనా కొట్టడానికొచ్చినా లేపు...

వాడు నిద్రపోయాడు. నాకింక నిద్ర రాదు. తెలిసిపోయింది. ఇంకాసేపటికి లైట్లు బందయ్యాయి. హఠాత్తుగా చీకటి పెంచిన ఉద్రేకమేమో...నా కళ్లు కొత్త కొత్త భంగిమల్లో తనను చిత్రించుకుంటున్నాయి. ఊహలు కూడ చెమటలు పట్టించేస్తున్నాయి. కిటికీ తెరిచాను...చలి కాలపు గాలులు చాలడం లేదు.

"బాబూ కిటికీ మూసేయమ్మా" – వాడెవడికో చలేసినట్టుంది. మూసేసాను.

అమ్మాయి కూడ కదలడం కనిపించింది. Cell Phone తీసి ఏదో చూస్తోంది. ఆ చిన్న phone వెలుగులో కళ్ళెత్తి నావైపు చూసింది. నేను తల తిప్పలేదు. చీకటిచ్చిన ధైర్యం! సరిగ్గా ఇటే ఎందుకు చూసినట్టో అనుకున్నాను. గాలి చొరబడింది ఇటు నుంచే కదా అని సరిపుచ్చుకున్నాను. జేబులో నా phone మోగింది. తీసి చూస్తే నాన్న.

నాన్న: ఎక్కడ దాక వచ్చావ్ రా? బయలుదేరావా లేదా?

నేను: బయలుదేరాను నాన్నా city దాటిపోయాము. ఉదయం ఏడింటికల్లా దిగిపోతాం భద్రాచలంలో...

అని చెప్పి ముగించేసాను.

ఇప్పుడు బస్సులో రెండే వెలుగులు. ఒకటి తన చేతిలో...రెండోది నాది. తను phone లో ఏం చేస్తోందో గాని నేనైతే ఏదో చేస్తున్నట్టు నటిస్తున్నాను.

కావాలని చూపులతో కాసేపు ఆడుకున్నాము చీకటిమొటికిళ్ళు. తను చూసేటప్పుడు నేను కళ్లు తిప్పి...నేను చూసేటప్పుడు తను కళ్లు దించి. కానీ తను బాగా ఆడింది. తనను చూస్తుండగా దొరికిపోయి ఓడిపోయాను. నవ్వింది. తను ఎప్పుడు నవ్వు విసురుదామా అని ఎదురుచూస్తుంటే నేనే అనవసరంగా "పొడగంటిమయ్యా మిమ్ము" పాట మొత్తం విన్నాననిపించింది.

నేనూ నవ్వాను.

కాసేపటికి భక్తడ్రైవరు... అన్నమయ్య పాటల sound తగ్గించాడు.

నాకు నీ దగ్గరకు రావాలనుందని సైగ చేసాను. తను కూడా అలానే సైగ చేసింది. వెలుగు సైగల విన్యాసాలు బావున్నాయనిపించింది. అంత చురుగ్గా అప్పటివరకు నేను ఎప్పుడూ లేను. తను ఇంకో అడుగు ముందుకేసి నాకు తన number ఇవ్వాలనుకుంది. తన phone లో అంకెలు పెద్దగా కనిపిస్తున్నాయి. ఒక్కటొక్కటిగా నాకు చూపించింది పది నెంబర్లు. తన శ్రావ్యమైన గొంతును ఎవరో గదిలో పెట్టి తాళం వేస్తే కిటికీ లో నుంచి నాకు తాళంచెవులు విసిరేసినట్టనిపించింది. Call చేసాను. China piece అనుకుంటా పోలీస్ సైరన్ లా గట్టిగా మోగింది. ఇద్దరు లేచారు. ఒక పాప ఏడ్చింది. Conductor లైటు వేసి ఒకసారి బస్సులోకి చూసాడు...ఆ లైటుకి ఇంకో అరడజను మంది లేచారు. తను call cut చేసే లోపు బస్సు నాలుగైదు గుంతల్లోంచి పోయింది. కొన్ని నిముషాలు తను ధ్యానంలోకి నేను మౌనంలోకి వెళ్లిపోయాం. బస్సు పూర్వావస్థలోకి వచ్చాక...మళ్లీ call చేసాను. ఈసారి silent గా ఎత్తింది సఖి.

నేను: Hello...

తను: Hi...

నేను: నీ పేరేంటి?

తను: పేరెందుకు?

నేను: ఏమని పిలవాలి...

తను: పిలుద్దూలే...మాట్లాడు ముందు.

నేను: ఎక్కడికెళ్తున్నావు?

తను: మా ఊరికి?

నేను: ఎందుకు?

తను: ఊరికే!!!

నేను: ఇందాక బస్ మొత్తాన్ని లేపావుగా alarm పెట్టిన warden లా...

తను: నవ్వింది.

నేను: Number ఎందుకిచ్చావ్?

తను: నన్నెందుకు చూస్తున్నావో అడిగి తెలుసుకుందామని.

నేను: నువ్వు నిలబడితే నా కాళ్లు నొప్పున్నాయి. ఇది చెప్దామని...

తను: ఇలా ఎవరు నిలబడటం చూసినా నొప్తాయా కాళ్లు?

భలే నరికింది నా అబద్ధాన్ని అనుకున్నాను.

నేను: నువ్వు చాల నచ్చావు...అందుకే చూస్తున్నా...

తను: అంతేనా...ఇంకా పిలిచి సీటిస్తావేమో అనుకున్నాను. నీ పక్కన చోటుందా?

నా గుండె ఝుల్లుమంది. ఇది ముగ్గురు కూర్చునే సీటు. ఒకటి నేను...రెండు వాడుగా కూర్చున్నాం. బస్సెక్కినపుడు ఒకాయన జరగమంటూ వస్తే కసిరి పంపాడు నా మిత్రుడు. వాడి స్వార్థం నాకు పనికొస్తుంటే సంతోషమేసింది.

నేను: ఉంది అన్నాను.

తను: పాపం మీ friend పడుకున్నాడు కదా?

నేను: వాడి మొహం... ఏం పరవాలేదు అటు తోసేద్దాం. వాడు సుషుప్తిలో ఉన్నాడు. నువ్వు రా...

తను: అంటే?

నేను: కోమా లాంటి నిద్ర. నువ్వు రా...

తనొస్తోంది. పరిమళం నా వైపు నడిచొస్తోంది. నా కాళ్లూ చేతులూ వొణికాయిగాని మనసు మాత్రం మట్టసంగా ఉంది. కోమా మిత్రుణ్ణి సీటు చివరికి జరిపాను. తనొచ్చి మధ్యలో కూర్చుంది. చున్నీ సర్దుకోవడం... గాజుల శబ్దం... ఊగే జుంకాలు...ఏం జరుగుతోందనిపించింది.

ఇంత అందమైన అమ్మాయిని ఎన్ని సార్లు చూసినా... ఇంత కన్నా అందమైన అమ్మాయిని ఇదే మొదటిసారి చూడ్డం. లోకంలో ఉన్న అందాలన్నింటితోనూ పోలికా...పోటీ...రెండూ తినే అయ్యింది నాకు.

నేను: నువ్వేం చదువుతున్నావ్? Engineering కదా...

అలా ఉన్నానా?

నేను: కాదా...మెడిసినా?

తను: నా సంగతెందుకు గాని...నువ్వేం చదువుతున్నావ్?

నేను: ఈ సంవత్సరమే Btech ఐపోయింది. మూడు నెలలయింది ఉద్యోగం వచ్చి.

తను: జీతమెంత?

మగాళ్లని జీతం ...ఆడవాళ్లని వయసు అని ఏదో సుత్తి చెబుతుండగా...

తను: నా వయసు 20

నేను: నా జీతం 20 వేలు.

బోలెడంత జీతం. ఏం చేస్తావ్ అన్ని డబ్బులు?

నేను: అవేం డబ్బులు. మా Manager కి నెలకి లక్ష.

అవునా...అంతేలే డబ్బులన్నీ మేనేజర్లే తీసుకుంటారు. మనకేమిస్తారు!!!

నేను: ఇంత అందంగా ఉండి రాత్రుళ్లు బస్సుల్లో తిరిగితే అబ్బాయిలు వెంటపడరా?

పడతారుగాని ధైర్యం చేసి సైగ చెయ్యరు!

నా ధైర్యాన్ని గుర్తించిన ముద్దబంతికి ఓ ముద్దివ్వాలనిపించిందిగానీ ధైర్యం రాలేదు.

నీ friend నా భుజం మీదికి ఒరుగుతున్నాడు.

నేను: వాణ్ని తొయ్యి అవతలికి. నేను మెలకువలో కుదురుగా ఉంటే...నిద్దట్లో ఉన్నా చూసావా వాడి కక్కుర్తి.

అంటూ వాణ్ణి దూరంగా జరిపాను.

తను: మెలకువలో కుదురుగా ఉండటం కష్టంగా ఉందా?

నేను: ఉండదా మరి?

తను: కష్టజీవులు!! ఎప్పటికి సుఖపడతారో కదా...

నేను: మరే!

అంటూ కొంచెం దగ్గరిగా జరిగాను. నా దగ్గర మాటలైపోతున్నాయి.

నేను: జీవితంలో నువ్వేమవుదామనుకుంటున్నావ్?

తను: ఒకవేళ నేను ఫలానాది అవుదామనుకున్నా...ఈ నాలుగ్గంటలు ఏమైనా చెయ్యగలనా...నీతో ఈ ప్రయాణం తప్ప!

వేడిగా తన భుజం రాసుకుంటున్న నాకు... నేనడిగే పప్పు ప్రశ్నల మీద తను చెప్పే గొప్ప సమాధానాల మీద ఆసక్తి ఆవిరైపోతోంది.

తను: ఉక్కగా లేదా నీకు?

నేను: ఉందేమో తెలీట్లేదు.

తను: నాకు తెలుస్తోంది. కొంచెం వర్షం కావాలి...కిటికీ తెరువు...

తెరిచాను. నిజంగానే జల్లు. చల్లగా మా మొహాలు తడిసాయి. నవ్వుకున్నాము ఒక్కసారిగా.

తను: నాకింకా వర్షం కావాలి.

నేను: ఒద్దొద్దు జలుబు చేస్తుందంటూ కిటికీ మూసాను.

తను: అబ్బ నిజంగానా!!! తెరవ్వోయి

అంటూ నా ఒళ్లోకొచ్చి కూర్చుని కిటికీ తెరిచి...జుట్టు విప్పుకుని... మొహం తడుపుకుంటూ అరచేతులు బయటపెట్టి ఆస్వాదిస్తోంది.

దాంతో...ఆఖరి సుత్తి దెబ్బకి గోడలోకి దిగబడిన మేకులా అయ్యాన్నేను. ఉలుకు లేదు...కాసేపు పలకనూ లేదు.

"బాబు మూసేయమ్మా"...ఇందాకెపుడో అరిచినవాడు మళ్లీ...

తను: ఆ...కిటికీ నాది. అటు తిరిగి పడుకోవయ్యా...

తన మోటు అరుపుకి వచ్చింది నాకు స్పృహ.

నా చేతులు వెనక నుంచి తనను గాఢంగా వాటేసుకున్నాయి.

నేను: నువ్వెందుకిలా చేస్తున్నావ్?

తను: ఎలా?

దిగిపోతుందని భయమేసి...

నేను: ఏం లేదులే...

జల్లు ఇంకా సన్నబడి వేగం పుంజుకున్నకొద్దీ అడవిలో లేళ్ళు, నెమళ్ళు పరవశించినట్టు ప్రవర్తిస్తోంది.

కాసేపయ్యాక సూర్యాపేట దాటింది బస్సు. చినుకులు అక్కడే దిగిపోయాయి. ఇప్పుడు వెన్నెలుంది కాని చంద్రుడు లేడు. ఈ పిల్ల లానే ప్రకృతి కూడా ఇష్టమొచ్చినట్టు ఆడుకుంటోంది.

నా ఒళ్లో అలానే నిక్షేపంగా కూర్చుని...

తను: బరువున్నానా...నిజం చెప్పు?

నేను: ఏం లేవు. మాట్లాడకుండా చంద్రుణ్ణి వెతుకు.

సాధారణంగా కాలచక్రం ఒకటనే అంటారు. ఈ బస్సుకి నాలుగున్నట్టున్నాయి...ఎంత వేగంగా గడిచిపోయిందో సమయం.

ఎన్నో విషయాలు మాట్లాడింది తను. ఆ పరిమళానికి, కౌగిలి వెచ్చదనానికి...ఏదో కొత్త ఆకలి కమ్ముకుంది నన్ను. ఇంతలో...

తను: నాకు ఆకలేస్తోంది. నీ దగ్గర తినడానికేమైనా ఉందా?

నేను: Apple ఉంది ఇవ్వనా...

తను ఊ కొట్టింది. Bag లో నుంచి తీసిచ్చాను.

నేను: భోంచేసి ఎక్కలేదా?

తను: లేదు. పొద్దున్నెపుడో తిన్నాను ఇడ్లీలు. అప్పటి నుంచి తిప్పుతూనే ఉన్నాడు మా మేనేజరు.

నేను: మేనేజరా??!! బస్సెక్కించి వెళ్లిపోయాడా?

తను: అంతలేదు. అడిగో ఆ last seat లో కూర్చున్నాడు చూడు. అతనే.

నేను కౌగిలి వదిలి వెనక్కి జరిగాను. తనేమనుకుందో...ఒడి దిగి పక్కన కూర్చుంది.

తను: మంచి నీళ్లున్నాయా?

ఇచ్చాను. తాగి Thanks చెప్పింది.

నేను: ఎటెళ్లినా మీ మేనేజరుతోనే వెళతావా?

తను: ఎటెళ్తున్నామో కూడా మేనేజరే చెప్తాడు.

తన phone తీసుకుని contacts list చూసాను. ఆ మేనేజరు నంబరొక్కటే ఉంది. ఏదో తెలిసిపోయిందని జాలిపడి తన ముందు అవివేకిని కాలేదు దేవుడి దయ వల్ల.

నేను: ఇవ్వాళ ఎక్కడికెళ్తున్నావ్?

తను: మా ఊరికి. మా అమ్మను చూడటానికి వెళ్తున్నా...నెలకోసారి వెళ్తాను.

నేను: మరేం తీసుకెళ్తున్నావ్ మీ అమ్మకి?

తను: ఎప్పటిలానే ఓ కబురు.. కొన్ని డబ్బులు.

నేను: ఏం కబురు?

తను: నేను మంచి ఉద్యోగమే చేస్తున్నాననీ...ఏవో పాడు పనులు చేసి డబ్బులు సంపాదిస్తున్నానని అనుకోవద్దనీ...త్వరలోనే మంచి ఇంట్లోకి తీసుకెళ్తాననీ...సరే సరే మా ఊరొచ్చింది. ఉంటాను.

నేను ఊ కొట్టాను. Conductor లైటు వేసాడు. తను బస్సు దిగింది. వెళ్లిపోయింది. పేరు కూడ చెప్పకుండానే!

ఇంకో రెండు గంటలకి మా ఊరొచ్చింది. వాణ్ణి లేపాను. ఇద్దరం దిగి Auto ఎక్కాము. మొదట మా ఇల్లొచ్చింది. దిగి ఆటోవాడికి డబ్బిస్తుంటే...

మిత్రుడు: చేతికి ఆ Band ఏంటీ?? ఎవరి జళ్లోంచి లాగావ్ రాత్రి?

ఆటో వెళ్లిపోయింది. చెయ్యి చూసుకున్నాను. రాత్రి కిటికీ లోనుంచి కురిసే వానకి తను జుట్టు విరబోసుకుని దీన్ని ఇలా అలంకరించింది. నేనే గమనించలేదు. తను నన్ను వదిలేసి వెళ్లిపోయిందనుకుంటూనే తనని నేను పట్టుకొచ్చుకున్నా చేతికి తొడిగించుకుని.

ఇంట్లో నాలుగు రోజులుండి హైదరాబాదు వెళ్లిపోయా. అయిదేళ్లు ఉద్యోగం చేసాక పెళ్లి చేసుకున్నాను. ఇంకో అయిదేళ్లు కాపురం...ఇద్దరు పిల్లలు. అద్దింట్లోనుంచి సొంతింట్లోకి ... సొంతింట్లోనుంచి ఇంకా పెద్దింట్లోకి మారాను. ఇప్పుడు కమలహాసన్ రాజకీయాల్లోక్కూడా వచ్చాడు.

నాతోపాటే చాలా కాలం ప్రయాణించిందది. నా bag లో...suitcase లో...dressing table సొరుగులో...అల్మారాలో...

ఎలానో తెలీదు ఇవ్వాళ కంటపడింది ఆ కనకాంబరం రంగు రబ్బరుబాండు.

తెగిపోయి!

★★★

Click here to share your comments on this story